# సువార్త అంటే ఏమిటి?



డానియేల్ సూర్య ఆవుల

# సువార్త అంటే ఏమిటి?

ప్రియమైన సహోదరుడా/ సహోదరి

నా జీవితంలో ఎప్పుడు  వినని ఒక గొప్ప సత్యాన్ని మీకు చెప్పాలని ఈ పత్రిక వ్రాశాను. ఇది యేసుక్రీస్తు ద్వారా దేవుడు మనకు ఉచితంగా ఇచ్చిన నిత్య జీవమును గురించినది. ఈ సత్యం నా మనసును, హృదయాన్ని, నా చిత్తాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది. ఇది ఈ సృష్టికి, పరలోకమునకు, మన నిత్యజీవమునకు సంబంధించినది. నిజదేవుని గూర్చిన సత్యం. నేను ఈ లోక మహిమ, ధనం, ఘనత, పేరు ప్రఖ్యాతలు – అన్నిటిని విడిచిపెట్టి ఇప్పుడు ఈ సత్యాన్ని వెంబడిస్తున్నాను. దేవుడు తన మహిమ కొరకు ఆయన సంకల్పము చొప్పున ఒక్కొక్క పాపిని వెదకి రక్షిస్తున్నాడని నమ్ముచున్నాను. ఎవరైతే విరిగి నలిగిన హృదయంతో దేవుని యొద్ద పాపక్షమాపణ కోరి, క్రీస్తు మరణమును, పునరుద్ధానమును నమ్మతారో వారికి ఆయన నిత్యజీవము ఇస్తాడు.

పరిశుద్ధ లేఖనాలంతటిలోను (బైబిల్) దేవుడ్ని మనం గొప్ప రక్షకుడిగా చూస్తాము. ఆయన తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా మనుషులను తమ పాపముల నుంచి, నిత్య నరకం నుంచి రక్షిస్తున్నాడు. ఈ సువార్తను ప్రకటించుట ద్వారా పాపులను తన చెంతకు పిలుస్తున్నాడు. “సువార్త” అనే పదమునకు “మంచి వార్త” అని అర్థం. ఈ సువార్తలో దేవుడు తన అపార ప్రేమచేత, కృప కనికరములతో పాపుల కొరకు చేసినదంత ఇమిడి ఉన్నది. బైబిల్ అంతటిలో ఇదే అసలైన సందేశం. మరియు, దేవుడు ఈ సందేశమును లోకములోని ప్రజలందరికి ప్రకటించమని ఆజ్ఞాపించాడు. ఈ ప్రకటనబట్టి మనుష్యులు తమ పాపముల

విషయమై పశ్చాత్తాపపడి, సువార్తను నమ్మి, యేసుక్రీస్తు ద్వారా నిత్య జీవమును పొందుతారు.

సువార్తలో నాలుగు భాగములు ఉన్నాయి. వీటిని స్పష్టంగా అర్థం చేసుకోవడం అవసరం. అవి ఏమిటంటే 1.దేవుడు 2. మనిషి 3. యేసుక్రీస్తు 4. మనిషి యొక్క స్పందన.

## 1. దేవుడు

సువార్త దేవునితో మొదలవుతుంది, ఎందుకంటే ఆయనే మొదటివాడు, సమస్తమునకు ఆధారమైయున్నాడు (ప్రకటన 1:8; 22:13, యెషయా 41:4; 44:6, హెబ్రీ 1:1-4). ఈ సృష్టిలో దృశ్యమైనవి, అదృశ్యమైన వాటితో సహా అన్ని చేసినవాడు ఆయనే (యోహాను 1:1-3; హెబ్రీ 1:1-4; కొలస్సి 1:16-17). బైబిల్ - “ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను” అనే పదాలతో మొదలవుతుంది. ఆయన సూర్యచంద్రులను, నక్షత్రములను, గ్రహాలను, నక్షత్రమండలాలను, సూపర్‌క్లస్టర్స్‌ను, మహా సముద్రములను, పర్వతములను, లోయలను, జంతువులను మరియు చేపలను, పక్షులను, ప్రాకెడు పురుగులను సర్వమును సృష్టించెను (ఆదికాండం 1:1-25). సమస్తమును తన శక్తిగల మాటచేత సృజించెను. దేవుడు “వెలుగు కమ్మని పలుకగా వెలుగు కలిగెను” (ఆదికాండము 1:3).

ఆయన సృష్టి అంతటిలో ఉన్నతమైన సృష్టి - స్త్రీ పురుషులను సృష్టించడం. దీనిని మూడు క్రియా పదాలతో బైబిల్ వివరిస్తుంది. 1. ఆయన చేసెను (ఆదికాండం 2:7), 2. ఆయన సృజించెను (ఆదికాండం 1:27), 3. ఆయన నిర్మించెను (ఆదికాండం 2:7). మనిషిని సృష్టించుటలో ప్రాముఖ్యమైన విషయం ఏమిటంటే “దేవుడు తన స్వరూపమునందు నరుని సృజించెను. తన స్వరూపమందు స్త్రీనిగాను, పురుషునిగాను సృజించెను” (ఆదికాండం 1:26,27).

దీనిని బట్టి మనం అర్థం చేసుకోవలసింది ఏమిటంటే మనిషి ఏ ఇతర జంతువుల నుండి ఉత్పన్నమవ్వలేదని మరియు జీవ పరిణామ ఫలితం వల్ల ఉద్భవించలేదని స్పష్టంగా తెలుస్తుంది. ఈ జీవ పరిణామం (ఎవల్యూషన్) అనేది మనిషి కల్పించినది. ఇది ఒట్టి అబద్ధం. మనిషి దేవుని సృష్టి. ఆయన ఒక ప్రణాళికతో, ఒక సంకల్పంతో, ఒక ఉద్దేశంతో మనిషిని చేశాడు. ఇది గ్రహించటం చాలా ప్రాముఖ్యం ఎందుకంటే ఇదే మానవజీవితానికి నిజమైన అర్థం, బాధ్యత, విలువ ఇస్తుంది (ఆదికాండం 1:26–28). దేవుడు సృష్టి ద్వారా తన అదృశ్య లక్షణాలను, అనగా తన నిత్య శక్తిని, మరియు దేవత్వమును తేటపరిచాడు (రోమా 1:20). ఆకాశములు కూడా నిత్యము దేవుని మహిమపరుస్తున్నాయి. మరియు విశాలమైన అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రకటించుచున్నది (కీర్తన 19:1). ఇక్కడ “మహిమ” అంటే దేవుని లక్షణాలన్నిటి ప్రత్యక్షపరచటం అని అర్థం.

మనిషి స్వతంత్రుడు కాడు. ఎందుకంటే తాను పూర్తిగా తన సృష్టికర్తపై ఆధారపడాలి. మనము పీల్చే గాలితో సహా అన్ని దేవుని బహుమానమే. భూమి దానిలో ఉన్న సమస్తము దేవునివి. లోకము దాని నివాసులు ఆయనవే (కీర్తనలు 24:1). మనము ఏమి చేయాలో ఎలా జీవించాలో ఆజ్ఞాపించే సర్వ హక్కు దేవునికి మాత్రమే ఉన్నది. ఎందుకంటే ఆయన మన సృష్టికర్త. ఈ సందర్భంలో మూడు దేవుని లక్షణాల గురించి ప్రస్తావించడం చాలా ప్రాముఖ్యం. మొదటిది, దేవుడు మంచివాడు. ఆయన ఎప్పుడు మంచి చేస్తాడు. ఆయన తన జీవులకు మంచి చేయాలనుకుంటాడు. మనిషికి ఎప్పుడు ఏది మంచిదో అదే ఆజ్ఞాపిస్తాడు. అందుకే మనిషిని సంరక్షించడానికి మరియు వారి సంతోషమును సంపూర్ణం చేయటానికి ఆయన వాక్యాన్ని ఇచ్చాడు. ఈ లోకంలో మనుషులు జీవించటానికి

కావలసిన నైతిక విలువలు దేవునియొద్ద నుండి వచ్చినవి. మనిషి కనుగొన్నవి కావు. ఏది తప్పో, ఏది ఒప్పో ఆయనే చెబుతాడు. ఈ సృష్టిలో దేనికి సాగిలపడకూడదని ఆయనను మాత్రమే ఆరాధించాలని ఆజ్ఞాపించాడు. తల్లిదండ్రులను సన్మానించాలని, దొంగిలించవద్దని, నరహత్య చేయవద్దని, నీ పొరుగువానిది ఏది ఆశింపవద్దని ఆజ్ఞాపించాడు (నిర్గమఖాండం 20:1–17).

రెండవది, దేవుడు పరిశుద్ధుడు, న్యాయవంతుడు, మరియు ఆయన న్యాయవిధులకు సంపూర్ణ విధేయతను కోరుచున్నాడు (లేవీకాండము 11:44–45, యెహోషువ 24:19). దేవుడు పరిశు ద్ధుడు గనుక పాపము అంటే ఆయనకు అసహ్యము. ఆయన ఆజ్ఞకు అతిక్రమమే పాపము. కాబట్టి, పరిశుద్ధుడైన దేవుని సన్నిధిలో ఆయన న్యాయవిధులకు అవిధేయులైన పాపులు నిలువలేరు (కీర్తనలు 1:5). దేవుని సింహాసనమునకు నీతి న్యాయములు పునాదులు (కీర్తనలు 89:14). ఆయన కనుదృష్టి దుష్టత్వమును చూడలేనంత నిష్కళంకమైనది (హబక్కూకు 1:13). మూడవది, దేవుడు కనికరము, దయ, దీర్ఘశాంతము, విస్తారమైన కృపాసత్యములు గలవాడు. వేయి వేలమందికి కృపను చూపుచు దోషమును, పాపమును, అపరాధము లను క్షమించును కాని, ఆయన దోషులను నిర్దోషులుగా ఎంత మాత్రమును ఎంచడు (నిర్గమ 34:6–7). అలాంటి ప్రేమ కలిగిన దేవుడు ఎప్పుడు మనిషి యొక్క క్షేమం కోరుకుంటాడు. క్లుప్తముగా చెప్పా లంటే దేవుడు మనలను సృష్టించాడు కనుక మనము ఆయన సొత్తు. మనము ఆయనకు విధేయులుగా ఉండాలని ఆజ్ఞాపించాడు. ఆయన తన నీతి పరిశుద్ధతలకు వ్యతిరేకముగా చేయు ప్రతి పాపమునకు తీర్పు తీర్చి శిక్షిస్తాడు. ఆయన పరిశుద్ధ లక్షణమును మరియు న్యాయవిధులను ఉల్లఘించినవారు ఆయన శిక్షను తప్పించుకోలేరు.

## ౨. మనిషి

కాని అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే, మనిషి దేవునికి విధేయత చూపుటలో విఫలుడయ్యాడు. తనపై దేవునికి ఉన్న హక్కును (సృష్టికర్త హక్కును) తిరస్కరించాడు (ఆదికాండము 3:6). దేవుని నీతిశాసనములపై తిరుగుబాటు చేశాడు. తనకు తానే సాటి అని ప్రకటించుకున్నాడు. తన ఉనికికి కారణం తనలో లేదని, దేవునిలోనే ఉన్నదని గుర్తించుటలో విఫలుడయ్యాడు. మనిషి చేసిన 4 పాపములు ఈ విధంగా ఉన్నాయి.

1. మనిషి సృష్టికర్తను తన దేవునిగ అంగీకరించాలి. కాని ఆయనను ఎరిగియుండియు దేవునిగా అంగీకరించలేదు, మహిమ పరచలేదు (రోమా 1:21).
2. అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యుల యొక్కయు, పక్షుల యొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు, పురుగుల యొక్కయు ప్రతిమా స్వరూపములుగా మార్చాడు (రోమా 1:23).
3. దేవుని సత్యమును అసత్యమునకు మార్చి, సృష్టికర్తకు ప్రతిగా సృష్టిని పూజించి సేవిస్తున్నాడు (రోమా 1:25).
4. సత్యమైన దేవుని జ్ఞానమునకు తమ మనసులలో చోటు ఇవ్వలేదు (రోమా 1:28).

ఇక్కడ రెండు సత్యాలను అర్థంచేసుకోవలసిన అవసరం ఉన్నది.

మొదటిగ – మనిషి దేవుని సృష్టి కాబట్టి ఆ సృష్టికర్తను ఆరాధించుటలోనే తన జీవితానికి ఒక ఉద్దేశము, అర్థము, సంతోషము దొరుకుతుంది (కీర్తనలు 2:11). అందుకే మనిషి దేవుని ఆరాధించకుండా జీవించలేడు. సృష్టికర్తను ఆరాధించకపోతే, సృష్టిని గాని (లేక) తనను తానే ఆరాధించుకుంటాడు.

రెండవదిగా – దేవుడు “శాశ్వతకాల” జ్ఞానమును, అనగా నిత్యత్వాన్ని మనిషి యొక్క హృదయములో పెట్టాడు (ప్రసంగి 3:11).

అందుకనే మనిషి మరణమును దాటి భవిష్యత్ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని ఎంతగానో ఆశపడతాడు. దేవుడు కాకుండ మరి ఏది మనిషి హృదయాన్ని నింపి నిరీక్షణనివ్వలేదు. దేవుడు లేని మనిషి విఫలుడుగ, విరామంలేనివాడిగా, నిమ్మళింపనేరని సముద్రమువలే నెమ్మదిలేనివాడుగా ఉంటాడు (యెషయా 48:22, 57:20). అట్టి మనిషిని తన ఇష్టానికి, దుష్టత్వానికి, మోసపూరితమైన పథకాలకు తన్నుతాను అప్పగించుకున్నాడు. ఫలితంగా మనిషి తన్ను తాను దిగజార్చుకొని తన మనసులో హీనుడైయ్యాడు. మరియు అంధకార హృదయముతో నిండుకున్నాడు. పాపములలో తన ఉనికినే పోగొట్టుకున్నాడు.

దేవునిపై తిరుగుబాటు ఈ రోజులలో ప్రతి మనిషిలో మనకు కనబడుతుంది. నిజానికి దీని ప్రభావమును మన సొంత జీవితాల లోనే అనుభవిస్తున్నాము. మనుష్యులు హేయమైన పాపములను చేస్తు, దుష్ట ఆలోచనలు, జారత్వము, దొంగతనము, నరహత్య, వ్యభిచారము, లోభము, చెడుతనము, కామవికారమును, మత్సరము, అసూయ, అహంకారము, అవివేకము, కలహము, కపటము, కొండెతనము, దేవ దూషణ, బింకములాడుటను, చెడ్డవాటిని కల్పించువారును, నిర్ధయులును, అనురాగ రహితులును, తల్లిదండ్రులకు అవిధేయులును అయి ఉన్నారు (మార్కు 7:21–23, రోమా 1:26–32). పురుషుడు, ఒక స్త్రీ వైపు వాంఛతో చూస్తే హృదయమందు వ్యభిచరించినట్టే (మత్తయి 5:27–28). ఇతరులను వ్యర్థుడా అంటే నరహత్యతో సమానము. అట్టివారు నరకాగ్నికి లోనగుతారు (మత్తయి 5:21–22). అబద్ధమాడితే దేవుని

న్యాయవిధిని మీరినట్టే. కాబట్టి మనిషి చేసిన ప్రతి పాపమునకు పర్యవసానము ఉంటుంది.

అందరు పాపము చేసినవారే నీతిమంతుడు లేడు, ఒక్కడైనను లేడు. నేను, నీవు కూడా పాపులమే. దేవుని వెదకువాడు ఒక్కడు లేడు (రోమా 3:10-11). మనము దేవునికి అవిధేయులైనప్పుడు ఆయన నీతి పరిశుద్ధతను, ఆయన ఇచ్చిన నీతి కట్టడలను మీరిన వారమవుతాము. మన అవిధేయత మనల్ని ఆత్మీయంగా చంపుతుంది (ఎఫెస్సీ 2:1-3). మనలో దేవుని జీవము లేదు. ఎందుకంటే జీవపు ఊటకు మూలాధారమైన ఆయనతో సంబంధమును పోగొట్టు కున్నాము. మన పాపములు మనల్ని నిత్య మరణమునకు తీసికెళతాయి. ఏలయనగా పాపమునకు జీతం మరణం (రోమా 6:23). దేవుని న్యాయవిధిని ధిక్కరించినందుకు శిక్ష "నరకము". అక్కడ ఆరని అగ్నియు, ఏడ్పును, పండ్లు కొరుకుటయు ఉండును (మత్తయి 13:50).

ఇప్పుడు ఒక పెద్ద అబద్ధము గురించి చెప్పాలి. అది మోసపూరితమైన దుష్టత్వపు ఆలోచనతో మానవుడు కల్పించిన అబద్ధం. దేవుని పరిశుద్ధ సన్నిధిలో నిత్యము జీవించడానికి కావలసిన నీతి, పరిశుద్ధతలను తాను చేసే మంచి పనుల ద్వారా మరియు దాన ధర్మముల ద్వారా పొందగలనని నమ్మటమే ఆ పెద్ద అబద్ధం. నా ప్రియ స్నేహితుడా, స్నేహితురాల జాగ్రత్తగా ఇది గ్రహించాలి. పాపాత్ములు వారి రక్షణ సంపాదించటానికి ఏమి చేయలేరు. అంటే రక్షణ లేక నిత్యజీవం సంపాందించేది కాదు. పాపియైన మనిషి చేసే మంచి పనులన్నియు దేవుని యెదుట మురికిగుడ్డల వంటివి (యెషయా 64:6). తాను చేసే మంచి క్రియల వల్ల ఏ మనుష్యుడు దేవుని దృష్టిలో నీతిమంతునిగ తీర్చబడడు (రోమా 3:20). ధర్మశాస్త్ర

క్రియలుగాని, ఆచారములు గాని ఒక వ్యక్తిని నీతిమంతునిగ తీర్చవు (గలతీ 2:16). కాబట్టి పాపియైన మనిషి తప్పిపోయినవాడై, నిస్సహాయ స్థితిలో ఉన్నాడు. ఇంతేగాక నిత్యము అగ్నిగంధకములతో మండు నరకమునకు వెళతాడు. నీతి పరిశుద్ధత గల దేవునికి మరియు హీనుడై చచ్చి నిస్సహాయ స్థితిలో ఉన్న మనిషికి మధ్య పెద్ద అగాధము ఉన్నది. ఈ అగాధమును దాటగలమా?

## 3. యేసుక్రీస్తు

కాని, ప్రేమాసంపన్నుడును, కృప కనికరములు గల దేవుడే మనిషి రక్షించుటకు చొరవ తీసుకున్నాడు. దేవుడు, తన కుమారుడైన యేసుక్రీస్తు ద్వార పాపములో మృతులైన వారికి జీవమును, మార్గమును దయచేస్తున్నాడు (యోహాను 3:16,14:6). త్రిత్వములో రెండవ వ్యక్తి యేసుక్రీస్తు (యోహాను 1:1). సృష్టి అంతా ఆయన ద్వారానే చేయబడినది, ఏదియు ఆయన లేకుండా కలుగలేదు. ఆయనే ఆదియు అంతమునైయున్నాడు (ప్రకటన 1:8). దేవుని లక్షణములన్ని కలిగియున్నవాడును, ఆయన పరిపూర్ణతయై ఉన్నాడు. ఆయనే రాజులకు రాజై, ప్రభువులకు ప్రభువునైయున్నాడు (ప్రకటన 17:14). ఆయన తన్నుతాను తగ్గించుకొని, మనుష్యుని ఆకారము దాల్చెను (ఫిలిప్పీ 2:8-9). తండ్రియైన దేవుడు మనుష్యుల పాపములకు ప్రతిగ పరిహారం చెల్లించుటకు తన ఏకైక కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపెను. అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా దేవుని కుమారుడు ఈ లోకములోనికి వచ్చెను (మార్కు సువార్త 10:45). ఆయన “ఇమ్మానుయేలు” అని పిలువబడినవాడు - “ఇమ్మానుయేలు” అనగా దేవుడు మనకు తోడైయున్నాడు అని అర్థం (మత్తయి సువార్త 1:23). ఆయన మనుష్యుని పోలికలో, మనుష్యుని ఆకారములో వచ్చాడు. దీనినే

మనము మానవ శరీరము దాల్చడం అంటాము. మానవ శరీరము దాల్చినపుడు, తన దైవ స్వభావమునకు మానవ స్వభావమును కలుపుకొన్నాడు. ఆయన సంపూర్ణముగ దేవుడు మరియు సంపూర్ణముగా మానవుడు (100% దేవుడు మరియు 100% మానవుడు). ఆయనలో దైవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగ నివశించుచున్నది (కొలస్సీ 2:9). దేవుని శక్తిచేత ఆయన కన్య గర్భమున అద్భుతరీతిగ జన్మించి (మత్తయి సువార్త 1:18-25), మచ్చ లేనివాడిగ పరిశుద్ధుడిగ జీవించాడు. సమస్త విషయములలోను మనవలే శోధింపబడినను పాపము లేనివాడుగ ఉండెను (హెబ్రీ 4:15). ఆయన పాపము చేయలేదు; ఆయన నోటను ఏ కపటము కనబడలేదు (1పేతురు 2:22). మచ్చ లేని గొఱ్ఱెవలె మన పాపములను తీసివేయుటకై ఆయన వచ్చెను. ఏ పాపము ఆయన యందు లేదు (1 యోహాను 3:5).

మన దోషముల కొరకు పాపములేనివాడైన యేసుక్రీస్తు శిలువలో బలి అయ్యాడు. ఎందుకనగా, మనము ఆయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగ చేసెను (2 కొరింథీ 5:21). మనలను విమోచించి తన సొత్తుగ చేసుకొనుటకు తన్నుతానే మన కొరకు అర్పించుకొనెను (తీతుకు 2:14). మన దోషములకు పరిహారము చెల్లించి, దేవుని ఉగ్రతను భరించి పాపికి రక్షణ కలుగజేయుటకు ఆయన మరణించెను (కొలస్సీ 1:20). మన దోషములకు ప్రాయశ్చిత్తము చేయుటకు తన రక్తమును చిందించెను. మనలాంటి పాపికి రక్షణ మార్గము చూపుటకు తండ్రియైన దేవుడు శిలువపై తన కుమారుని శిక్షించి, శిలువ ద్వారా తన ప్రేమను చూపించాడు. మన దోషములను తన కుమారుని శరీరములో శిక్షించి న్యాయమును

కూడా కనపరచెను. పాపికి శిలువయొద్ద మాత్రమే క్షమాపణ అని చూపించాడు కాని పాపములను శిక్షించకుండ విడిచిపెట్టలేదు (నిర్గమ 34:7). తండ్రియైన దేవుడు తన కుమారుని శిక్షించి, ఆయన అర్పణను అంగీకరించి, మూడోవ దినమున మృతులలో నుండి తిరిగి లేపెను. దీన్ని మనము ప్రభువుయొక్క పునరుత్థానము అంటాము (రోమా 1:4; 1కొరింథి 15:3-4).

శిలువపై క్రీస్తు యొక్క మరణము ద్వారానే పాపికి దేవునితో సమాధానము కలుగుతుంది. ఆయన పునరుద్ధానము తరువాత పరలోకమునకు ఆరోహణుడై ఇప్పుడు దేవుని కుడివైపు ఆసీనుడై యున్నాడు. దేవుడు సజీవులకును, మృతులకును తీర్పు తీర్చుటకు యేసుక్రీస్తును న్యాయాధిపతిగా నియమించెను (అపో.10:42). ఆయన రాకడ కొరకు మనందరము ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాము. పాపులకు తీర్పు తీర్చి ఆయన నీతిగల రాజ్యమును స్థాపించుటకు వస్తాడు. ఆయన రాజ్యము యుగ యుగములు నిలుచును (ప్రకటన 11:15).

## 4. మనిషి స్పందన

దేవుని యొద్ద నుండి వచ్చిన దేవుని కుమారుడైన యేసుక్రీస్తు మనకు సువార్త. మనిషి యొక్క మరణమును మరియు నిత్యమైన ఎడబాటున బట్టి దేవుడు ఎంత మాత్రము సంతోషించడు (యెహెజ్కేలు 18:32). దేవునితో నిత్యము జీవించి ఆయన సన్నిధిలో సంతోషించాలంటే, నీవు యేసుక్రీస్తును విశ్వసించి, నీ పాపముల కొరకు పశ్చాత్తాపపడాలి. ఈ విశ్వాసము గ్రుడ్డిది కాదు. గాని దేవుని వాగ్దానములను నమ్మి, మన పాపముల నుండి విమోచించి రక్షించే పునరుద్ధానుడైన యేసుక్రీస్తును నమ్ముట. నిత్య జీవము కొరకు క్రీస్తును విశ్వసించుట మాత్రమే కాదు గాని నీవు ఆశపడే

సమస్తమును విడిచిపెట్టి, మన దేవుడు మరియు రక్షకుడైన క్రీస్తువైపు తిరగాలి. నిన్ను నీవు ఉపేక్షించుకొని ప్రతి దినము యేసుక్రీస్తును వెంబడించాలి (లూకా 9:23). నిత్యత్వములో దేవుని సన్నిధిలో యుగయుగాలు నడవడానికి నీవు విశ్వసించిన దాన్నిబట్టి యేసుక్రీస్తు యొక్క నీతిని నీకు ఇస్తాడు. నీ రక్షణ దేవుని యొక్క ఉచిత బహుమానము. దీనిని నీవు క్రియలద్వారా సంపాదించుకొనలేవు గాని విశ్వాసము ద్వారా పొందగలవు. నీవు క్రీస్తును నమ్మి, దేవునికి అప్పగించుకొని పాపమునకు దాసునిగ ఉండుట మానుకోవాలి. రక్షణ ఉచితమే కాని అది నీ సమస్తాన్ని కోరుకుంటుంది. నీ స్వాతంత్రమును, నీ స్నేహమును, నీ కుటుంబమును, నీకున్న సమస్తము కన్నా క్రీస్తును ప్రేమించాల్సి ఉంటుంది. దీనికి అర్థం ఏమిటంటే దేవునికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. యేసుక్రీస్తును మరియు నిత్యజీవమును పొందుకొనుటకు అన్ని వదులుకోవటము ఎంతో విలువైనది.


**CITY HILLS BIBLE CHURCH**

# 50-1-43, Near Kshatriya Kalyana Mandapam
ASR Raju Nagar, Seethammadara
From Alluri Seetharamaraju Statue Straight Up
Opposite Road to Little Giggle Play School
Visakhapatnam, A.P., 530013
**Phones: 91827 11367 / 85002 92732 / 93999 98999**
Email: chbcvizag@gmail.com